
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం ׀ 22 ׀ అక్టోబర్ ׀ 2023



రైతుకు కొండంత అండ

వామికొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 130 కోట్లు కేటాయించింది.

-IVలో



లోకపావనీ.. వాసవీ!

దేవీశరన్నవ రాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లాలోని ఆలయాల్లో అమ్మవారు వివిధరూపాల్లో భక్తులకు దర్శమిచ్చింది.

-IVలో

గరిష్టం/కనిష్టం
35.9 /23.9

వాతావరణం

జిల్లాలో శనివారం 23.9 - 35.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అందరికీ ఆరోగ్యం

కడప రూరల్: అందరికీ ఆరోగ్యమే ధ్యేయంగా చేపడుతన్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. శనివారం జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు జరిగాయి. ఈ శిబిరాలకు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందారు. పోరుమామిళ్ల పరిధిలో జరిగిన మెడికల్ క్యాంపునకు ఎమ్మెల్యే గోవిందరెడ్డి హాజరయ్యారు. మిగతా ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 27 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 27 కేసులను పరిష్కరించారు. బాధితులకు రూ. 1,63,19000 నగదును అందేలా చేశారు.

బాధ్యతల స్వీకరణ



రత్నకుమారికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ రత్నకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఏలూరు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేశారు. పదోన్నతి లభించడంతో ఇక్కడ ప్రాంతీయ సంచాలకులుగా విధులను చేపట్టారు. అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్)గా పనిచేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. తాజాగా ఈ స్థానంలోకి రత్నకుమారి వచ్చారు.ఆమెకు కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అలావుల్లా, బత్తనయ్య, వినీష అభినందనలు తెలిపారు.

27న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరుమన్నామలైకి జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఎనిమిది ప్రత్యేక సర్వీసులను నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప నుంచి రాత్రి 9 గంటలకు, జమ్మలమడుగు నుంచి ఉదయం 7 గంటలకు, మైదుకూరు నుంచి ఉదయం 7.00, సాయంత్రం 6.00 గంటలకు, పోరుమామిళ్ల నుంచి ఉదయం 5,30, 6.00 గంటలకు, పులివెందుల నుంచి రాత్రి 8.00 గంటలకు, ప్రొద్దుటూరు నుంచి రాత్రి 9.00 గంటలకు, బద్వేలు నుంచి ఉదయం 6.00 గంటలకు సర్వీసులు నడుస్తాయన్నారు. ఆయా బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు గిరి ప్రదక్షిణకు రాను, పోను తమ టిక్కెట్లను రిజర్వు చేసుకోవాలని కోరారు.

ఈ-బస్సులకు కొత్త స్టాపింగ్‌లు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప-తిరుపతి మధ్య నడుస్తున్న ఎలక్ట్రికల్ బస్సులకు కొత్తగా రాజంపేట, రైల్వేకోడూరులలో స్టాపింగ్‌లు కల్పిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఈ బస్సులలో కడప నుంచి రాజంపేటకు రూ.120, కడప నుంచి రైల్వేకోడూరుకు రూ.190లు, కడప నుంచి తిరుపతికి రూ. 300లుగా చార్జి నిర్ణయించారు.

పోలీసు సేవలు అజరామరం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు, ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ పోలీసు అధికారులు



అమరవీరులకు సాయుధబలగాల శ్రద్ధాంజలి

ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో వుండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్టలేనివని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు పేర్కొన్నారు. ప్రజల ధన,మాన, ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. ప్రజల క్షేమం కోసం త్యాగాలు చేసిన వారిని ఎప్పటికీ మరువలేమన్నారు. శనివారం కడప లోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్మృతి పరేడ్‌కు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనా బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద వారు పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు మాట్లాడుతూ పోలీసు యూనిఫాంకు సమాజంలో అత్యంత గౌరవం ఉందన్నారు. పోలీసుశాఖలో విధులు సంక్లిష్టంగా ఉంటాయన్నారు. దేశానికి సైనికులు, పోలీసు వ్యవస్థ రెండు కళ్లు వంటివని, కళ్లు బాగున్నపుడే సమాజం సురక్షితంగా ఉంటుందన్నారు.ఐటీబీపీ, బీఎస్ఎఫ్ దళాలు ఏర్పాటు చేయకముందు పోలీసులే సరిహద్దుల వద్ద భద్రతను పర్యవేక్షించేవారన్నారు. దేశంలో తమ బాధ్యతను నెరవేర్చేక్రమంలో 38 వేలమంది పోలీసులు ప్రాణాలు అర్పించారన్నారు. క్రిమినల్ జస్టిస్ సిస్టంలో పోలీసుశాఖ పాత్ర అమోఘమన్నారు.

- జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ అమరవీరులైన వారి ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.ప్రజలు సాధారణంగా ఆర్మీ, పారా మిలటరీలలో అంతిమ త్యాగం వుంటుందనీ పేర్కొన్నారు. దేశ రక్షణలో పోలీసుల పాత్రపై ప్రజలకు స్పష్టత లేదని, ట్రాఫిక్, సమీప పోలీస్‌స్టేషన్‌లో పోలీసు వ్యవస్థ వరకే అనుకుంటారని, కానీ దేశ భద్రతకు సంబంధించి లీడ్‌రోల్ పోషించేది కూడా పోలీసే అని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ఏడాది కాలంలో జిల్లాలో ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబసభ్యులకు పోలీసుశాఖ అండగా వుంటుందనీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు, హోంగార్డు కుటుంబసభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.



అమరులైన పోలీసు కుటుంబసభ్యులకు జ్ఞాపికలను అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు, జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



జ్ఞాపికను అందుకుని చెమర్చిన కళ్లతో పోలీసు హెడ్‌కానిస్టేబుల్ సతీమణి సుధామణి

- పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ చేపట్టిన సంక్షేమ, సేవా కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయాచిత్రాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనాబాబు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ దగ్గరుండి ఒక్కో ఛాయా చిత్రానికి సంబంధించిన వివరాలను విశదీకరించారు. పోలీసులు వినియోగించే ఆయుధాల ప్రదర్శన 'ఓపెన్ హౌస్'ను ప్రారంభించి తిలకించారు. ప్రదర్శనలో భాగంగా పోలీసు జాగిలాలు రూబీ, డయానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నేర పరిశోధనలో కీలకపాత్ర పోషించే వాటి గురించి డాగ్ స్క్వాడ్ బృందం వివరించింది.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి.కృష్ణారావు, ఏ.ఆర్. డీఎస్పీ రమణయ్య, డీఎస్పీ బాలస్వామిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, శ్రీశైలరెడ్డి, ఆనంద్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, అసోసియేషన్ సభ్యులు, అమరులైన పోలీసు సిబ్బంది కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

26 నుంచి ప్రచార మహోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈ నెల 26 నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ప్రచార మహోత్సవాన్ని నవంబరు 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలు, తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నామన్నారు. కాగా, కడప జోన్ ఇప్పటివరకు కార్గో ద్వారా రూ. 5.24 లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుని ఎనిమిది జిల్లాల పరిధిలో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.

26 నుంచి డీఆర్‌పీలకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)లో భాగంగా డిస్ట్రిక్ లెవెల్ రీసోర్సు పర్సన్(డీఆర్‌పీ)లకు అక్టోబర్ 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విజయవాడ జయప్రకాష్ నగర్‌లోని ఆంధ్ర లయోలా క్యాంపస్‌లో శిక్షణ ఉంటుందని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. కావున ప్రధానోపాధ్యాయులు డీఆర్‌పీలుగా ఉన్న ఉపాధ్యాయులను 25వ తేదీన రిలీవ్ చేసి శిక్షణకు పంపాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు.

పాడి రైతులకు అమూల్ శుభవార్త

- వరుసగా మూడోసారి దసరా బోనస్

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం, అమూల్ డెయిరీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్న పాల వెల్లువ' కార్యక్రమంలో భాగంగా మూడోసారి పాల ఉత్పత్తిదారులకు దసరా బోనస్ చెల్లించినట్లు అమూల్ జిల్లా కో-ఆర్డినేటర్ వింజమూరి ఉదయ్ కిరణ్ శనివారం తెలిపారు. కడప జిల్లాకు సంబంధించి 155 గ్రామాలకు 3313 మంది పాడి రైతులకు రూ.22,36,575, అన్నమయ్య జిల్లాకు సంబంధించి 362 గ్రామాలలోని 4037 మంది పాడి రైతులకు రూ. 68,85,531, శ్రీ సత్య సాయిజిల్లాకు సంబంధించి 121 గ్రామాల్లోని 1592 మంది పాడి రైతులకు రూ. 21,94,757, తిరుపతి జిల్లాకు సంబంధించి 78 గ్రామాల్లో 803 మంది పాడి రైతులకు రూ. 5,84,486 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.

పాలస్తీనాపై దాడిని ఖండిస్తూ ర్యాలీ



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ శనివారం కడప నగరంలో ముస్లిం మైనార్టీలు శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. నబీకోట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాత బస్టాండ్, నాగరాజు పేట, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సెవెన్ రోడ్స్ సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ ప్రారంభం నుంచి భారతదేశ పతాకం రెపరెపలాడింది. గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబుల మోత మోగించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దాడుల్లో అనేక మంది అమాయక ప్రజలు, చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం దారుణమన్నారు. పాలస్తీనా ప్రజలు ఆహారం, తాగునీరు లేక అల్లాడిపోతున్నారని.. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దాడుల్లో సర్వస్వం కోల్పోయిన పాలస్తీనా ప్రజలకు ప్రపంచ దేశాలు అండగా నిలబడాలని, ఆ ప్రాంతంలో శాంతియుత పరిస్థితులు నెలకొనేలా చూడాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు. మత పెద్దలు, ప్రజాస్వామ్యవాదులు, వామపక్షాల నేతలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గండి నిత్యాన్నదానానికి భూరి విరాళం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.2,00116లు విరాళంగా అందాయి. తొండూరుకు చెందిన అడికే రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగేశ్వరరెడ్డి(డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త), కోడలు మంజుల, మనుమడు ప్రణీత్ కుమార్ రెడ్డిలు ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా వారు సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కాగా, ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్‌లు దాతలచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రం అందజేశారు.



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని ఇస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్

సర్వేజనా సుఖినోభవంతు

- లోక కల్యాణం కోసం వేద పారాయణం
- దసరా మహోత్సవాలకు తరలివచ్చిన వేదపండితులు



SAKSHI SPECIAL

అమ్మవారిశాలలో శ్రీ చక్రానికి అభిషేకం చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్: పండుగల సందర్భంలో ఇంట్లో కానీ, ఆలయాల్లో కానీ వేద మంత్రాలతో పూజలు నిర్వహించడం చూస్తుంటాం. అయితే పది రోజుల పాటు జరిగే దసరా పండుగలో అమ్మవారిని స్తుతిస్తూ నాలుగు వేదాల్లోని మంత్రాలు, జప హోమాలు వేదపండితులు నిర్వహిస్తుంటే మనసు పులకరించి భక్తిభావం పెరుగుతుంది. చతుర్వేద పారాయణం, జప హోమాదులు జరపడం ద్వారా అందరికీ మంచి జరిగి సమస్త జీవరాశులు సుఖసంతోషాలతో జీవిస్తారని ప్రతీతి. దసరా ఉత్సవాలను నిర్వహించడంలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన ప్రొద్దుటూరు పట్టణంలో దేవీనవరాత్రుల సందర్భంగా వివిధ ఆలయాల్లో వేదపారాయణం, హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించేందుకు రాష్ట్రంతోపాటు రాజస్థాన్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వేదపండితులు పట్టణానికి చేరుకున్నారు. వీరి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఒక్కో ఆలయంలో 5 నుంచి 19 మంది వేదపండితులు పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిశాలలో ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదాలతోపాటు రామాయణ, మహాభారతం, భాగవత పారాయణం, శతచండీయాగాలను వీరు నిర్వహిస్తున్నారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన పాంచరాత్రాగమ పండిత్ శ్రీనాథాచార్యులు ఏడుగురు శిష్యబృందం ఆధ్వర్యంలో రోజూ ఆగమశాస్త్రం ప్రకారం పూజలు చేస్తున్నారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది వేద పండితులు పూజలు నిర్వహిస్తున్నారు.

లోక కల్యాణం కోసమే..

రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 19 మంది వేద పండితులతో నవరాత్రుల సందర్భంగా హోమాలు, జపాలు, చతుర్వేద పారాయణలను చేస్తున్నాం. తోగడ్డేటి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. 18 ఏళ్లుగా దసరా వేడుకలకు సంబంధించిన పూజల్లో పాల్గొంటున్నాను. లోక కల్యాణం కోసమే వేదపారాయణం నిర్వహిస్తున్నాం.

– వెల్లాల వెంకట శేషయ్యశర్మ, ఆళ్లగడ్డ

స్వామి,అమ్మవార్లకు అందాలు అద్దుతూ...!

మదనపల్లె సిటీ: దేవుడి ఉత్సవం కానీ, ఊరేగింపు గానీ వైభవంగా జరగాలంటే ఉత్సవ మూర్తుల అలంకరణకు ప్రాధాన్యం ఉంటుంది. పట్టువస్త్రాలు, కిరీటాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో చేసే అలంకారం వల్లనే దేవతామూర్తుల సౌందర్యం ద్విగుణీకృతమవుతుంది. అయితే ఈ అలంకరణ అందరికీ సాధ్యం కాదు. దేవస్థానాల్లో పూజలు చేసే ఆగమం ప్రకారమే చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా దేవతామూర్తులను అందంగా అలంకరించడంలో సిద్ధహస్తుడు మదనపల్లెలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ. ప్రతి ఏడాది నిర్వహించే దసరా ఉత్సవాలకు శ్రీలలిత.. త్రిపుర సుందరిదేవి అమ్మవార్ల అలంకణలు విభిన్న రూపాల్లో పది రోజుల పాటు చేస్తారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో జరిగే ఉత్సవాలకు వెళ్లి ప్రత్యేకంగా అలంకరణ చేస్తున్నారు. కళ్యాణోత్సవాలకు దేవతా విగ్రహాలనుఅందంగా అలంకరించి, ప్రశంసలు పొందుతున్నారు.

అలంకరణకు 5 గంటలు

దసరా ఉత్సవాల్లో అమ్మవారి ప్రత్యేక అలంకరణలకు సుమారు అయిదు గంటలు పడుతుంది. ఇందు కోసం అలంకణ వస్తువులు కుంభకోణం, బెంగుళూరు ప్రాంతాల నుంచి తెచ్చుకుంటారు. వివిధ రకాల పూలను హారాలు ఇక్కడే కట్టిస్తారు.



అమ్మవారికి అలంకరణ చేస్తున్న అర్చకులు ఫణికుమార్‌శర్మ (ఇన్‌సెట్) ఫణికుమార్‌శర్మ (ఫైల్)

ఆకర్షిస్తున్న ఆఫర్లు!

కడప కల్చరల్: ఆఫర్లే ఆఫర్లు....ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు, వస్త్రాలు, ఫర్నీచర్, మొబైల్ ఫోన్లు, ఎల్రక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు ఇలా రోడ్ల కూడళ్లలో ఎక్కడ చూసినా ఆఫర్లే ఆఫర్లు. ప్రజలను ఆకర్శిస్తూ ఆఫర్ల భారీ హోర్డింగులు అడుగడుగునా చిన్నసైజు లైటింగ్ బోర్డులు, వీధుల్లో ఆటోల్లో ప్రచార హోరు, పత్రికలు, మీడియా ప్రసారాలలో కూడా ఆఫర్లే.

దసరా ధమాకా

దసరా పండగొచ్చిందంటే అందరికీ సంతోషమే. అందులోనూ పదిరోజుల పండుగ దసరా అంటే మరింత సంతోషం. సెలవులొచ్చాయని పిల్లలు సంబరపడితే, పండుగ సందర్భంగా కొత్త వాహనాలు తెచ్చుకుంటే మంచిదని, పండుగ సంతోషం మరింత ఇనుమడిస్తుందని పెద్దలు భావిస్తారు. ముఖ్యంగా దుస్తులు, వాహనాల కొనుగోళ్లు దసరా పండుగ సందర్భంగా జోరుగా సాగుతాయి. వస్త్ర వ్యాపారులు భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి పలు రకాల ఆఫర్లను ప్రకటించారు. కొందరు దసరాతోపాటు వ్యాపారాలను మరో నెల రోజులు పొడిగించుకునేందుకు దసరా నుంచి దీపావళి వరకు దసరావళి పేరిట ఆఫర్లను కొనసాగిస్తూ బ్యానర్లు, బోర్డులను ఏర్పాటు చేశారు. వస్త్ర వ్యాపారాలతోపాటు ఫ్యాన్సీ, ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణదారులు కూడా పెద్ద ఎత్తున ఆఫర్లను ప్రకటించారు. ద్విచక్ర వాహనాల వ్యాపారులకు ఈ పండుగ ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ సందర్భంగా పలు ద్విచక్ర వాహన డీలర్లు రెండు, మూడు రోజులపాటు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ మేళాలు నిర్వహించనున్నారు. ద్విచక్ర వాహనం కొంటే సైకిళ్లు, టీవీలు, సెల్‌ఫోన్లు, మిక్సీలు, గోల్డ్ కాయిన్, సీడీ ప్లేయర్లు లాంటి పలు ఆకర్శణీయమైన కానుకలు ఇవ్వనున్నట్లు భారీ హోర్డింగులు ఏర్పాటు చేసి ప్రజలను ఆకర్శిస్తున్నారు. ముఖ్యంగా విజయదశమి సందర్భంగా, తమ కొనుగోలు విజయవంతంగా సాగాలని కోరుకుంటూ పండుగ సంతోషం పెరిగేలా నూతన వాహనాన్ని కొనడం శుభదాయకమని ప్రజలు భావిస్తున్నారు. అందుకే విజయదశమి నాడు నూతన వాహనం ఇంటికి తెచ్చుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల కొనుగోళ్లే ప్రధానపాత్ర వహిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లోనూ అదేజోరు: స్థానిక దుకాణదారులే కాకుండా ఆన్‌లైన్ ద్వారా వ్యాపారం చేసే కంపెనీలు కూడా భారీగా డిస్కౌంట్లు ప్రకటించాయి. పండుగ స్పెషల్‌గా రెండు, మూడు ప్రముఖ ఆన్‌లైన్ కంపెనీలు 40 శాతం నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్ సేల్స్ ప్రకటించాయి. ప్రముఖ దినపత్రికల్లో ఫుల్ పేజీల ప్రకటనలు ఇవ్వడంతోపాటు టీవీల్లో కూడా భారీగా ప్రచారం చేస్తున్నాయి. ఒక్కో కంపెనీ వారు దాదాపు 40 నుంచి 60 రకాల వస్తువుల వరకు డిస్కౌంట్‌లో ఆఫర్లు ప్రకటించాయి. కొన్నిచోట్ల డెలివరీ సిబ్బంది కొరత కారణంగా వస్తువులు ఆలస్యమవుతాయని కంపెనీదారులు ముందే ప్రకటిస్తుండడం విశేషం. ఆన్‌లైన్‌పై కొనుగోలు చేసే వారికి మొత్తం కొనుగోలు చేసే ధరను బట్టి పాయింట్లను కేటాయిస్తూ వాటిని ధరకు జమ కట్టి ఆ ధరకు కూడా వస్తువులను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డుల కొనుగోళ్లపై కూడా పాయింట్లు కేటాయింపు, వారి ఆధారంగా మళ్లీ కొనుగోలు జరుగుతున్నాయి. మొత్తం దసరా పండుగ సందర్భంగా అతి తక్కువ ధరలో వస్తువులు పొందే అవకాశం ఉందంటూ ప్రజలు సంతోషిస్తుండగా, కేవలం పండుగ రోజుల్లోనే ఈ అవకాశం ఉన్నందున వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.

పోటాపోటీ ప్రచారం

ఎప్పటిలాగా ఆఫర్ల ప్రచారం కోసం వ్యాపారుల మధ్య భారీ పోటీ నెలకొంది. ముఖ్యంగా దినపత్రికల్లో రెండు, మూడు ఫుల్ పేజీల వ్యాపార ప్రకటనలు దసరా ప్రారంభం నుంచి వెలువడుతున్నాయి. దుకాణాల ముందు కూడా ప్రత్యేకంగా ఆర్చీలు ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుద్దీపాలు అలంకరించి ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ఉన్నట్లు ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేకంగా వాల్ పోస్టర్ల ద్వారా కూడా ప్రచారం చేసుకుంటున్నారు. దసరా, దీపావళి వ్యాపార ప్రకటనల కోసం కొందరు ప్రత్యేకంగా వాహనాలను ప్రకటనలకు అనుకూలంగా తయారు చేయించి ఆకర్శణీయంగా రూపుదిద్ది వీధుల్లో తిప్పుతున్నారు.

వేములలో యాత్ర-2 సినిమా షూటింగ్



వేములలోని వీధులలో యాత్ర-2 షూటింగ్‌లో హీరో జీవా, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సాంబశివారెడ్డి

వేముల: మండల కేంద్రమైన వేములలో శనివారం యాత్ర-2 సినిమా షూటింగ్ ప్రారంభమైంది. హీరో జీవా పురవీధులలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచార సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా హీరో జీవా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే రచ్చబండవద్ద భారీగా తరలి వచ్చిన కార్యకర్తలతో బహిరంగ సభ నిర్వహిస్తున్న సన్నివేశాన్ని చిత్రీకరించారు. అనంతరం పాఠశాల వద్ద మెయిన్‌రోడ్డులో ప్రచార రథంపై ఎక్కి పార్టీని గెలిపించాలని ప్రసంగించే సన్నివేశాలు చిత్రీకరించారు. పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి షూటింగ్‌ను తిలకించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన ద్విచక్రవాహనదారుడు

సిద్దవటం: కడప- చెన్నై ప్రధాన రహదారిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి (32) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల తెలిపిన కథనం మేరకు వివరాల ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి ద్విచక్రవాహనదారుడు కడప- చెన్నై ప్రధాన రహదారి అయిన బాకరాపేట వైపు నుంచి కడపకు వెళుతున్నాడు. ఇదే సమయంలో కడప వైపు నుంచి రాజంపేట వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం మలినేనిపట్నం గ్రామ సమీపంలోకి వెళ్లగానే ద్విచక్రవాహనదారుడిని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చాపాడు సమీపంలో వృద్ధురాలి దుర్మరణం

చాపాడు: ప్రొద్దుటూరు - మైదుకూరు జాతీయ రహదారిపై మండలంలోని నాగుపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వృద్ధురాలు(70) మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కృషి

కడప కల్చరల్: రాష్ట్రంలోని కథోలిక క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం ఆల్ ఇండియా కథోలిక యూనియన్ పోరాడుతోందని నేషనల్ లీగల్ అడ్వైజర్ స్వామినాథన్ అన్నారు. శనివారం మరియాపురం ఎంపీఎస్ఎస్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కథోలిక క్రైస్తవ మతాన్ని బలోపేతం చేసేందుకు అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా బాలరాజు, కో కన్వీనర్‌గా ఇలియాస్‌రెడ్డి, సభ్యులుగా ఎండి అల్ఫోన్స్, రవీంద్ర ప్రభు, జయపాల్, విక్టర్, నిర్మలమ్మలను ఎన్నుకున్నారు. కథోలిక గురువులు కడప డీన్ ఎండి ప్రసాద్ రావు, ఎంపిఎస్ఎస్ఎస్ డైరెక్టర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన పసిడిపురి.!

- వెంటాడుతున్న ఐటీ దాడుల భయం
- ప్రొద్దుటూరులో బంగారు దుకాణాల మూసివేత
- పెళ్లిళ్ల సీజన్ వేళ.. తులం బంగారు కూడా మార్కెట్లో దొరకని పరిస్థితి
- మూడో రోజు కొనసాగుతున్న ఇన్‌కంట్యాక్స్ సోదాలు
- బడా బంగారు దుకాణాల వివరాలను సేకరిస్తున్న ఐటీ అధికారులు?


బోసిపోయిన బంగారు దుకాణాలున్న మెయిన్‌బజార్

ప్రొద్దుటూరు క్రైం : స్వచ్ఛమైన బంగారుకు ప్రొద్దుటూరు ప్రసిద్ధి. ఎక్కడ బంగారు దొరక్క పోయినా ప్రొద్దుటూరులో మాత్రం కొదవ ఉండదు. కిలోల లెక్కన ఎంత బంగారు కావాలన్నా నిమిషాల్లోనే దొరుకుతుంది. బంగారు వ్యాపారంలో రెండో ముంబైగా పేరు గాంచిన ప్రొద్దుటూరులో బంగారు కరువైంది. ఇప్పుడు గ్రాము బంగారు దొరకడం కూడా గగనమైంది. ఐటీ సోదాలతో బెంబేలెత్తిన వ్యాపారులు దుకాణాలను మూసేశారు. ప్రధాన బంగారు విక్రయ దుకాణాలు మూత పడటంతో వాటి అనుబంధంగా ఉన్న వేలాది వర్క్ షాపులను మూసేశారు. దీంతో పసిడిపురి వీధులు బోసిపోయాయి. ఎప్పుడూ కిటకిట లాడుతూ కనిపించే బంగారు దుకాణాల వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

పెళ్లిళ్ల సీజన్‌లో తులం బంగారు కూడా దొరకని పరిస్థితి

ప్రొద్దుటూరులో 1800 దాకా బంగారు దుకాణాలు ఉన్నాయి. మిగతా ప్రాంతాల కంటే ఇక్కడ స్వచ్ఛమైన బంగారు లభిస్తుండటంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు నుంచి బంగారు కొనుగోళ్ల నిమిత్తం వస్తుంటారు. దీంతో సీజన్‌తో సంబంధం లేకుండా ఇక్కడి దుకాణాలు నిత్యం కిటకిట లాడుతుంటాయి. పెద్ద ఎత్తున బంగారు వ్యాపారాలు జరగడంతో ప్రొద్దుటూరు రెండో ముంబైగా పేరు పొందింది. బంగారు విక్రయ దుకాణాలకు అనుబంధంగా పట్టణంలో సుమారు 5 వేల వరకు వర్క్ షాపులు ఉన్నాయి. ఇందులో పని చేస్తున్న స్వర్ణకారులందరూ బంగారు దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నారు. రోజు వ్యాపారాలు బాగానే ఉన్నా.. అక్షయతృతీయ, దసరా, దీపావళి పండుగలతో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో అయితే కొన్ని దుకాణాల్లో కూర్చోడానికి చోటు దొరకదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం దసరా, పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారులు పెద్ద ఎత్తున రెడిమేడ్ ఆభరణాలను సిద్ధం చేసుకున్నారు. పెళ్లి ముహూర్తాలున్నందున స్వర్ణకారులు కూడా నెల రోజుల ముందు నుంచే ఆభరణాలు తయారు చేసేందుకు పెద్ద ఎత్తున ఆర్డర్లు తీసుకున్నారు. ఆర్డర్లు ఇచ్చిన వారు నగల కోసం వచ్చి దుకాణాలు మూత పడటంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లో మూడు రోజుల నుంచి పలు దుకాణాల్లో ఆదాయపన్ను శాఖ అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రొద్దుటూరులో ఐటీ సోదాలు జరగడం ఇది కొత్తేంకాదు. ఏడాదిలో నాలుగైదు సార్లు తనిఖీలు జరుగుతుంటాయి. కొన్ని గంటలు లేదా ఒక రోజులో తనిఖీలు చేసి ఐటీ అధికారులు వెళ్లి పోయేవారు. అయితే ప్రధాన బంగారు దుకాణాల్లో మూడు రోజులుగా జరిగే సెంట్రల్ ఐటీ సోదాలు ప్రొద్దుటూరు బులియన్ మార్కెట్‌ను కుదిపేసిందని చెప్పొచ్చు. ఐటీ దాడుల సెగ తమకు ఎక్కడ అంటుకుంటుందో అన్న భయంతో 90 శాతంపైగా దుకాణాలు మూత పడ్డాయి. దీంతో తులం బంగారు కూడా ఎక్కడా దొరకని పరిస్థితి ఏర్పడింది. బంగారు ఆభరణాల కోసం దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారు. దుకాణాలు మూత పడటంతో పట్టణంలో వేలాదిగా ఉన్న వర్క్ షాపుల సముదాయాలు, పెద్ద పెద్ద కాంప్లెక్స్‌లన్నీ మూసేశారు. ఈ సీజన్‌పై ఎంతో ఆశలు పెట్టుకున్న తమకు తీవ్ర నష్టం వచ్చిందని స్వర్ణకారులు వాపోతున్నారు. షాపులు మూత పడటంతో ఎప్పుడూ రద్దీగా ఉండే వీధులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి.

బడా దుకాణాలపై ఐటీ కన్ను

ప్రొద్దుటూరులో పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహించే దుకాణాలపై ఐటీ అధికారులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. మూడు రోజుల నుంచి నాలుగు దుకాణాల్లో ఐటీ దాడులు జరుగుతున్నాయి. వీటిలో సోదాలు చేసి ఆదాయపన్ను శాఖ అధికారులు వెళ్తారని అందరూ భావించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వివిధ హోదాల్లో ఉన్న 40 మందికి పైగా ఐటీ అధికారులు సాయుధ దళాలతో కలిసి ప్రొద్దుటూరుకు వచ్చారు. వీరిలో కొందరు అధికారులు రెండు, మూడు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని పలు బడా దుకాణాలను పరిశీలించారు. ఈ పరిశీలన రెండు రోజుల నుంచి కొనసాగుతుండటంతో మిగతా వ్యాపారుల్లో గుబులు నెలకొంది. దీంతో పెద్ద షాపులతో పాటు చిన్నాచితక దుకాణాలన్నీ మూత పడ్డాయి. కొందరు వ్యాపారులు నమ్మకస్తులైన వర్క్ షాపుల్లో బంగారు నిల్వలను ఉంచినట్లు తెలుస్తోంది.

మూడో రోజు కూడా కొనసాగుతున్న తనిఖీలు

ఈ నెల 19న మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన సెంట్రల్ ఐటీ సోదాలు శనివారం కూడా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నాలుగు షాపుల్లో అధికారులు తనిఖీలు చేశారు. ఆదివారం కూడా సోదాలు జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. కాగా మూడు రోజుల నుంచి దుకాణాల యజమానులు, వారి కుటుంబ సభ్యులు, గుమాస్తాలు ఇళ్లలోనే ఉండిపోయారు. వారి సెల్‌ఫోన్లు కూడా పని చేయలేదు. దీంతో తనిఖీలు జరుగుతున్న దుకాణాల్లో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. బిల్లులు లేని, పన్ను చెల్లించని బంగారును పెద్ద మొత్తంలో గుర్తించినట్లు మార్కెట్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా ఐటీ అధికారులు స్వయంగా ప్రకటన విడుదల చేస్తేగానీ తనిఖీలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

ఐటీ సోదాల్లో బిల్లులు లేని బంగారు సీజ్?

ప్రొద్దుటూరులోని బంగారు దుకాణాల్లో ఐటీ అధికారులు జరుపుతున్న సోదాల్లో రూ. 2 కోట్ల మేర నగదు, సుమారు 300 కేజీలుపైగా బిల్లులు లేని బంగారును సీజ్ చేశారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే ఐటీ అధికారులు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ప్రొద్దుటూరులోని ఒక బంగారు వ్యాపారి నుంచి శనివారం కస్టమ్స్ అధికారులు ఏడు బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఒక వ్యక్తి నుంచి శుక్రవారం పెద్ద మొత్తంలో బంగారును కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో ప్రొద్దుటూరులోని వ్యాపారి నుంచి బంగారు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసు అమర వీరుల సేవలు మరువలేనివి


పోలీసుల అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి, బెటాలియన్ కమాండెంట్

సిద్దవటం : దేశ సరిహద్దుల్లో విపరీతమైన చలి ఉన్నప్పటికీ దేశం కోసం, ప్రజల కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసువులు బాసిన పోలీసు అమర వీరుల సేవలు మరచి పోలేనివని బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు, సిద్దవటం కోర్టు జడ్జి శ్రీనివాసకళ్యాణ్ పేర్కొన్నారు. సిద్దవటం మండలం భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిద్దవటం కోర్టు జడ్జి, బెటాలియన్ కమాండెంట్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కమాండెంట్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కొన్ని సందర్భాల్లో పోలీసులు తమ ప్రాణాలను సైతం కోల్పోవాల్సి వస్తోందన్నారు. బెటాలియన్ ఏఓ గులామ్ దస్తగిరి, అసిస్టెంట్ కమాండెంట్ జయప్రసాద్‌రావు, శ్రీనివాసరావు, డీఎస్పీ/ అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి, ఆర్‌ఐలు అలీబాషా, కె.వి. రమణ, కె.వి. రంగారావు, సీతారోకే రాజు, ఎం. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ పోటీల్లో కడపకు మూడోస్థానం


టెన్నిస్‌బాల్ పోటీల్లో మూడోస్థానంలో నిలిచిన కడప జట్టు

కడప స్పోర్ట్స్: ఇటీవల గుంటూరు జిల్లా పేరిచర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టుకు మూడో స్థానం లభించింది. జట్టులో చక్కటి ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేసినట్లు ఏపీ టెన్నిస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రొద్దుటూరు పూజ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒంటేరు వీక్షిత్‌రెడ్డి, ప్రతీష్‌రెడ్డి, ఖాజీపేట బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలకు చెందిన అబ్దుల్ రెహమాన్, జగదీష్, కౌశిక్, యోగానంద, కౌషిక్, సాత్విక్, చాణక్య, మనీష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు డిసెంబర్‌లో కొడైకెనాల్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

అండర్-23 క్రికెట్ టోర్నీలో 'అనంత'కు అగ్రస్థానం

- నెల్లూరు, చిత్తూరు జట్లు విజయం
- ముగిసిన అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్


కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పాయింట్ల పట్టికలో 7 పాయింట్లతో అనంతపురం జట్టు అగ్రస్థానంలో నిలువగా, 6 పాయింట్లతో చిత్తూరు రెండోస్థానం, 4 పాయింట్లతో నెల్లూరు మూడోస్థానంలో నిలిచాయి. శనివారం చివరిరోజు కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 176 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 46.5 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి. సుబ్రమణ్యం 64 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు కనిష్ 5, ఇస్మాయిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 36.3 ఓవర్లలో 188 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 67 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు అఖిల్ 8 వికెట్లు, సుబ్రమణ్యం 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 103 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 303 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 214 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

చిత్తూరు జట్టుకు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో 387 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 55.1 ఓవర్లలో 484 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 99 పరుగులు, లోహిత్ 75 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆసిఫ్ హుస్సేన్ 4, ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 55.1 ఓవర్లలో 216 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శివకేశవరాయల్ 102 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు రెడ్డి ప్రకాష్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 4.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా విజయానికి అవసరమైన 29 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ 19 పరుగులు చేశాడు. దీంతో చిత్తూరు జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 296 పరుగులు చేయగా, చిత్తూరు జట్టు 484 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.


శివకేశవ 102 పరుగులు | నిఖిత్ గౌడ్ 99 పరుగులు | అఖిల్ 8 వికెట్లు

సరదా మాటున ప్రమాదం

తిలక్ నగర్‌కు చెందిన సుంకర శంకర్, వెంకటసాయి కడప నగర శివారున నీటికుంటలో పడి మృత్యువాత పడ్డారు. స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొడదామని వెళ్లిన వీరు అక్కడ మట్టికోసం తీసిన గుంతను గమనించక నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 15న జరిగిన ఈ సంఘటన ఆ కుటుంబాల్లో విషాదం నింపింది.

- పిల్లల షికారుపై తల్లితండ్రుల అప్రమత్తత అవసరం
- కాల్వలు, కుంటలలో సరదాతో పొంచి ఉన్న ప్రమాదం


ఇటీవల ఇద్దరి ప్రాణాలను బలికొన్న చలమారెడ్డిపల్లె నీటికుంట

కడప ఎడ్యుకేషన్: సెలవు వచ్చిందంటే చాలు.. చిన్నారులు ఒకచోట చేరి ఆనందంగా గడిపేస్తున్నారు. కొందరు ఆటలాడుతూ, మరింత మంది కొత్త ప్రదేశాలకు వెళ్తూ ఆహ్లాదంగా గడుపుతున్నారు. సరదా అంటూ తెలియక చేసే కొన్ని తప్పులు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. నీటి కుంటల్లో ఈత కోసం వెళ్లడం, నిబంధనలు తెలియకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌తో ఎక్కువ సేపు కాలక్షేపం చేయడం వంటి వాటితో ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు. సరదా మాటున ప్రమాదం పొంచి ఉందనే వాస్తవాన్ని గ్రహించక ఇంటిల్లిపాదికీ విషాదం మిగిలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని విషయాల్లోనూ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటు పోలీసులు, ఇటు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

ఎండలతో జరభద్రం

ప్రస్తుత సీజన్‌లో ఎండలు బెదరగొడుతున్నాయి. ఒకవైపు ఉక్కపోత.. మరోవైపు ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ తరుణంలో చిన్నపాటి నీటి కుంట కంటపడితే చాలు సరదాగా దూకి సేదతీరాలని పిల్లల మనసు ఉర్రూతలాడుతోంది. ఇక వారి గురించి చెప్పాల్సిన పనేలేదు. ఎక్కడ నీటి కుంట కనిపించినా అందులో ప్రమాదాన్ని గుర్తించక దూకి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చివరకు తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. కుంటలవైపు వెళ్లకుండా తల్లిదండ్రులు వారిపై నిఘా పెట్టాల్సిందే.

స్నేహితులతో బయటకు వెళ్లితే...

సెలవులకు ఇంటికి వచ్చిన పిల్లలు స్నేహితులతో కలిసి సరదాగా బయటకు వెళ్లడం మామూలే. బయటకు వెళ్లే పిల్లలు తమ తల్లి దండ్రులకు ఎవరితో వెళుతున్నారు.. ఎక్కడికి వెళ్లతున్నారనే విషయాలను చెప్పి వెళ్లేలా అప్రమత్తం చేయాలి. కొంతమంది పిల్లలు విషయం చెబితే బయటకు పంపరని తెలిసి చెప్పకుండా వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. యజమానులు వారికి ఫోన్ చేసి ఎక్కడున్నావంటూ ఫాలోఅప్ చేయాల్సిన అవసరం ఉంది.


వెంటకసాయి(ఫైల్)

మోటార్ బైక్‌తో అప్రమత్తం

కొందరు పిల్లలు సెలవు రోజున తమ తల్లిదండ్రుల మోటర్ బైక్ తీసుకుని సాహస విన్యాసాలు చేస్తుంటారు. దీంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుంది. కాళ్లు చేతులు విరగ్గొట్టుకోవడం, ఏకంగా ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంటుంది. ఈ సంఘటనలు తల్లిదడ్రులకు జీవిత కాలం నరకం మిగల్చడం తప్ప మరోకటి ఉండదు. మలిదశలో తల్లితండ్రులకు తోడు ఉండాల్సిన పిల్లలు వికలాంగులైతే జరిగే నష్టంపై అవగాహన కల్పించాలి.

సెల్‌ఫోన్‌లకు దూరంగా...

పిల్లల చేతిలో సెల్‌ఫోన్ ఉందంటే చాలా ఒళ్లు మరచి గంటల తరబడి కాలక్షేపం చేస్తారు. స్కూల్ నుంచి రాగానే పుస్తకాల బ్యాగ్ పక్కన పడేసి సెల్‌ఫోన్ గేమ్స్‌లో మునిగిపోతుంటారు. గంటల తరబడి రీల్స్, గేమ్స్‌తో గడిపేస్తుంటారు. సెలవు రోజుల్లో పిల్లలకు సెల్‌ఫోన్ దూరంగా ఉంచాలి. వారిని ఏకాంతంగా వదిలేయకూడదు. తల్లిదడ్రులు, తాతలు, అమ్మమ్మ, నానమ్మలతో ఎక్కువ సమయం గడిపేలా చూడాలి. ఉమ్మడి కుటుంబాలు, పూర్వ విషయాలు, బంధుత్వాల గురించి పిల్లలకు తెలియచేస్తూ అవగాహన కల్పించాలి.

పిల్లలకు తోడుగా ఉండాలి



సెలవుల్లో ఇంటికి వచ్చిన పిల్లలు బయటకు వెళ్లాలంటే కచ్చితంగా తల్లిదండ్రులు తోడు వెళ్లాలి. పిల్లలను ఒంటరిగాగానీ, ఫ్రెండ్స్‌తో గానీ వెళ్లనీయరాదు. కొత్త ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు చెప్పాలి. దీంతో పాటు ఆట, పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సెలవులు ముగిసే వరకు పిల్లలను ఒక కంట కనిపెట్టే ఉండాలి. తల్లితండ్రులు కూడా ఎక్కువ సమయం గడపాలి.

- ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏఎస్పీ ప్రేరణకుమార్ తెలిపారు. మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాల 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం డీఎస్ఏ ప్రొఫెసర్ జేవీ రమణ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు, కళాశాల ఓఎస్ఏ డాక్టర్ రాంబాబు కళాశాల విశిష్టత, కళాశాలలో జరుగుతున్న పరిశోధన, విస్తరణ అంశాలు, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుకు కొండంత అండ

త్వరలో 'వామికొండ' ప్రాజెక్టు కాలువ పనులు
- పైసా విదిల్చని టీడీపీ సర్కార్
- వైఎస్సార్ హయాంలో రూ. 75 కోట్ల నిధులు
- అభివృద్ధి పనులకు రూ 130 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- 10 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం


వామికొండ రిజర్వాయర్

కడప సిటీ : దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధవహించారు. గండికోట, వెలిగల్లు, వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టుతోపాటు పలు ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జలయజ్ఞం పేరిట భారీగా నిధులు వెచ్చించారు. అందులో భాగంగా ముద్దనూరు మండలం ఒంటిగారిపల్లె సమీపంలో వామికొండ రిజర్వాయర్ ఉంది. దీని నీటి సామర్థ్యం 1.66 టీఎంసీలు ఉండగా, జీఎన్ఎస్ఎస్ 24వ కిలోమీటరు వద్ద నిర్మించారు. 2013లోనే ఈ ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయి. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో రూ. 75 కోట్లు ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులకు కేటాయించి రిజర్వాయర్ బండ్, ప్రొటెక్షన్ పనులు, స్లూయిజ్ గేట్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు.తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఒక్క పైసా కూడా విదిల్చలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ. 130 కోట్ల నిధులను కేటాయించారు. రివిట్‌మెంట్, అప్రోచ్ చానల్స్, బండ్ గ్రౌటింగ్ పనులు ఈ మొత్తంతో చేశారు. ఇక డిస్ట్రిబ్యూటరీ నిర్మించి కాలువల ద్వారా 10 వేల ఎకరాలకు మార్చి నాటికి నీళ్లందేలా చర్యలు తీసుకుంటున్నారు.

10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం

ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. ఎడమ కాలువ ద్వారా 8 వేల ఎకరాలకు, కుడి కాలువ ద్వారా 2 వేల ఎకరాలకు నీళ్లందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేకాకుండా వీఎన్ పల్లె, ముద్దనూరు మండలాలకు తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది. ఈ కాలువల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి వచ్చే మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రైతుల భూములకు రక్షణ

ఎన్నో ఏళ్లగా పరిష్కారం కాని సమస్య వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పరిష్కారం కానుంది. వామికొండ ప్రాజెక్టుకు సంబంధించి ఒంటిగారిపల్లె గ్రామానికి చెందిన 75 ఎకరాలు ఊటలు బారి వ్యవసాయానికి ఆటంకంగా మారాయి. ఈ నేపథ్యంలో సిమెంటు గ్రౌటింగ్ పనులు చేసి ఆ భూములకు రక్షణ కల్పించి కాపాడనున్నారు. ఈ పనులు పూర్తయితే మళ్లీ ఆ భూములు ఊటలు బారకుండా వ్యవసాయానికి యోగ్యంగా మారతాయి. అంతేకాకుండా 12 గ్రామాల పొలాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందే అవకాశం ఉంది.

ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక కృషి

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఈ ప్రాజెక్టు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపట్టేందుకు కృషి చేశారు.ఈ విషయాన్ని పలుమార్లుముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతం అయ్యేందుకు చొరవ చూపారు.

డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ. 130 కోట్లు

వామికొండ నుంచి డిస్ట్రిబ్యూటరీకి నీళ్ల తరలించి అక్కడి నుంచి కాలువల ద్వారా సాగునీటిని అందించాల్సి ఉంటుంది. ఈ డిస్ట్రిబ్యూటరీ పనులకు సంబంధించి ప్రభుత్వం రూ. 130 కోట్లు కేటాయించింది. టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పనులన్నీ పూర్తయితే రైతులకు సాగునీటి అవసరాలు తీరి తమ భూముల్లో ముక్కారు పంటలు పండించుకునేందుకు అవకాశం కలుగనుంది. గతంలో ఎన్నడూ పూర్తి నీటి సామర్థ్యంతో ప్రాజెక్టులో జలకళ సంతరించుకోలేదు. కానీ ఈ ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేయడంతో అధిక వర్షాలు వచ్చిన సమయంలో 2020 డిసెంబరులో ప్రాజెక్టును పూర్తి నీటి సామర్థ్యంతో నింపారు. ఇది గుర్తించుకోదగిన రికార్డు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు చుట్టుపక్కల పొలాల్లో ఉన్న బోర్లకు నీరు పుష్కలంగా రావడంతో పంటలు ఆశించిన స్థాయిలో సాగయ్యాయి.

త్వరలో కాలువ పనులు



వామికొండ ప్రాజెక్టుకు సంబంధించిన కాలువ పనులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎడమ, కుడి కాలువల ద్వారా 10 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించే విధంగా ప్రణాళికలు తయారు చేశాం. అంతేకాకుండా ఎన్నో ఏళ్లగా పరిష్కారం కాని ఒంటిగారిపల్లె రైతుల భూముల విషయంలో గ్రౌటింగ్ సీపేజీ సమస్య ఉండడంతో 75 ఎకరాల భూములకు ఇబ్బంది కలుగుతోంది. సిమెంటు గ్రౌటింగ్ పనులు ప్రస్తుతం చేస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం.
– మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

లోకపావనీ.. వాసవీ!


గాయత్రీదేవిగా అమ్మవారు


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన సెట్టింగ్

దేవీశరన్నవ రాత్రులలో భాగంగా 7వ రోజైన శనివారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చింది. సకల విద్యా ప్రదాయినీ గాయత్రీ అంటూ భక్తులు అమ్మవారిని శరణు వేడారు. త్రిమూర్తులు, వాయిద్య గణపతులు, రాధాకృష్ణుల విగ్రహాల సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది. –ప్రొద్దుటూరు కల్చరల్

నవంబర్ 30లోగా ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2023 సంవత్సరం మార్చి నెలలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ కింద పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్మీడియట్ విద్య సెక్రటరీ అవకాశం కల్పించినట్లు ఇంటర్ విద్య డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఫీజును నవంబర్ 30వ తేదీలోగా తాము చదివిన కళాశాలలకు వెళ్లి చెల్లించాలని ఆయన తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు సబ్జెక్టుల పరంగా అనుమానాలు ఉంటే ప్రిన్సిపాల్ అనుమతి తీసుకుని నివృత్తి చేసుకోవచ్చని, అవసరమైతే తరగతులకు కూడా వెళ్లవచ్చని ఆయన తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

కడప అర్బన్: అత్త తనను వేధిస్తోందంటూ ఓ కోడలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోచంపేటకు చెందిన ఆలీమున్‌కు, రుషాన్‌కు 2020లో వివాహమైంది. వీరికి పాప సంతానం. గత ఏడాది భర్త రుషాన్ కువైట్‌కు వెళ్లి మరలా తిరిగిరాలేదు. ఆలీమున్, తన కుమార్తెతో కలిసి నకాష్‌లోని తన బంధువుల ఇంటిలోనే నివాసం ఉంటోంది. తన అత్త ఆలియా తనను వేధిస్తోందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయరాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

29న ధర్నాను విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న విజయవాడలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్– 1938 జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రాళ్లపల్లి అబ్దుల్లా కోరారు. ఈ విషయమై శనివారం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ధర్నా గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీపీఎస్, 117 జీవో రద్దు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కమాల్‌బాషా, నరసింహులు, మురళి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు పి.రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్రందన దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు, పీఆర్సీ, డీఏ తదితర బకాయిలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల గంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్‌బాషా, బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి, పర్మనెంట్ చేయాలన్నారు. ఈ నెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మద్దిలేటి, జిల్లా నాయకుడు శివరాం తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత


శాంతినగర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, తల్లితండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. రెండోరోజు శనివారం కూడా కడపలోని వైఎస్సార్‌కాలనీ, శాంతినగర్, బీడీకాలనీల్లో బడిబయట పిల్లలను బడిలో చేర్పించే విషయమై డీఈఓ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా బడిమానేసిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లితండ్రులతో చర్చించి పిల్లలను బడిలో చేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందన్నారు. నాడు– నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చిందన్నారు. పిల్లల కోసం మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, చిక్కీలు ఇలా పలు రకాల పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కావున తల్లితండ్రులు తమ పిల్లలను బడి మాన్పించవద్దన్నారు. ఈ విషయమై డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలు సమష్టిగా పనిచేయాలన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి కడపలోని సాయిపేట, బళ్లారిరోడ్డులలో, ఎంఈఓ పాలెం నారాయణ ఆలంఖాన్‌పల్లి ప్రాంతంలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏఏఎల్ఎస్ దశరథరామిరెడ్డి, ఏపీఎస్ స్కూల్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తాం

ఏపీఎండీసీ ఎండీ వి.జి.వెంకటరెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి

ఓబులవారిపల్లె: మంగంపేట అగ్రహారం గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తామని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మంగంపేట ఏపీఎండీసీలో ఆయన ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలుష్య గ్రామస్తులతో పునరావాసం తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీటీడీసీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఓరుగంటి నవీన్, తల్లెం రమణారెడ్డి పాల్గొన్నారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గనులకు కూత వేటు దూరంలో ఉన్న అగ్రహారం గ్రామాన్ని తరలించాలని, మంగంపేట కాపుపల్లె , దళితవాడ గ్రామాలకు పరిహారం, పునరావాసం త్వరగా చేపట్టాలని, గోవిందంపల్లె చెరువులో డ్రైనేజీ నీరు కలుషతం తదితర సమస్యలను ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. చర్చలు సఫలం కావడంతో మంగంపేట అగ్రహారం గ్రామాన్ని ఈ నెలాఖరులోపు తరలిస్తామని ఎండీ వెంకటరెడ్డి గ్రామస్తులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. దాదాపు 45 కోట్ల రూపాయల ప్యాకేజీతో పాటు గతంలో కంటే వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఏపీఎండీసీ పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరం పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏపీఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఏపీఎండీసీ ఫౌండేషన్ ద్వారా 8 మంది విద్యార్థులకు మొత్తం 90 వేల రూపాయలు అందజేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మంగంపేట ఏపీఎండీసీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎండీ వెంకటరెడ్డి అన్నారు. ఏపీఎండీసీ కార్యాలయంలో మంగంపేట ఏపీఎండీసీ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయించాలని కోరారు. ఇందుకు ఎండీ స్పందిస్తూ నవంబర్ రెండవ తేదిన కార్మిక సంఘాల నాయకులు విజయవాడ కార్యాలయానికి రావాలని అక్కడ చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, తల్లెం రమణారెడ్డి, ఓరుగంటి అనిల్, జేసీఎస్ కన్వీనర్ అమరేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రాజు, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, వార్డు మెంబర్ జి.శారదమ్మ, మైనారిటీ నాయకులు షేక్ కరీముల్లా, పులగంటి శ్రీను, పులగంటి నరసింహులు, సీపీఐ నాయకులు పండుగొల్ల మణి తదితరులు పాల్గొన్నారు.